కృత్రిమ మేధాతో ఉపాధి అవకాశాలు మెండు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : కృత్రిమ మేధాతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్ కొణతాల తిరుమలేష్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో 'కృత్రిమ మేథా-ఉపాధి అవకాశాలు' అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు సాంకేతిక పరిజ్ఞానంలో వస్తాన్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త కొత్త అంశాలు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో బిగ్ డేటా, డేటా అనాలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అంశాలు ఉండగా నేడు వాటి స్థానంలో జెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజీ మోడల్స్, చాట్ జిపిటి, రిట్రివల్ ఆగ్యుమెంటెడ్ జనరేషన్ వంటి అంశాలు వచ్చాయన్నారు. వీటిపై కూడా అవగాహన పెంచుకున్న వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సిఎస్ఇ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు, వివిధశాఖల సిబ్బందితో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఎస్.కోటలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా నియోకవర్గ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలకు గానూ ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసేందుకు (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) ఎంపిక చేసిన ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిపేం దుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులకు, సిబ్బందికి నిర్దేశించిన విధులను సక్రమంగా చేపట్టాలని దిశానిర్దేశం చేసారు. అభ్యర్థులు తమ ప్రచారాన్ని చట్ట పరిధికి లోబడి మాత్రమే చేపట్టాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఓ మురళీకృష్ణ, ఈఆర్ఓ ఎస్.కిరణ్ కుమార్, వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మళ్ళీ సంక్షేమ పాలన రావాలంటే జగన్మోహన్ రెడ్డి సీఎంకావాలి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేర్చారని, వైసీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటెయ్యాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బొబ్బిలి మండల పరిధిలో గల నిమ్మలపాడు, కొయ్యకొండవలస, సిముదుగుడ్లవలస, చెల్లయ్యవలస, కేషయ్యవలస, కొత్తవలస తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే శంబంగి సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజా ఆశీర్వాదం కోరారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు చేసిన మంచిని వివరించారు. మళ్ళీ సంక్షేమ పాలన రావాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని గెలిపించాలని కోరారు.రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి తనను,విజయనగరం జిల్లా ఎంపీ అభ్యర్థి శ్రీ బెల్లాన చంద్రశేఖర్ గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పండిక వేలంగిణి, మాజీ సర్పంచ్ చొంగళ రామకృష్ణ,మాజీ ఎంపీటీసీ మరిపి దువ్వినాయుడు,మాజీ సర్పంచ్ తెలు గోపాల్, మాజీ ఉప సర్పంచ్ కునుకు శ్రీరాములు,రెడ్డి త్రినాధ, బొత్స శంకర్రావు,బొమ్మి త్రినాధ,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి : మంత్రి బొత్స

విశాలాంధ్ర-చీపురుపల్లి: అభివృద్ధి సంక్షేమానికి పాటుపడుతున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించండి మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దేవరపదను, నిమ్మలవలస తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బొత్స మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు ఏకదాటిపై తీసుకెళుతున్న జగన్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్. బొత్స సందీప్, వంశీకృష్ణ, మండల పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, మీసాల వరహాల నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం సహాయ వ్యవసాయ సంచాలకులు కే మహారాజన్ శనివారం తన కార్యాలయంలో కమిషనర్ వారి ఆదేశాల మేరకు సబ్ డివిజన్లోని ఎరువుల డీలర్లకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం నందు ఉండే ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఎటువంటి పోస్టర్లు ఉండకూడదని పిఎంకె ఎస్కె కు సంబంధించిన పోస్టర్‌ను పూర్తిగా కప్పివేయాలని రైతులకు ఎరువులు సరఫరాచేసే బస్తాలమీద ఉన్న ప్రజాప్రతినిధుల ఫోటోలను కప్పి ఉంచాలని తెలిపారు. కావున సబ్ డివిజన్ కు సంబంధించి నాలుగు మండలాల్లో ఎరువుల డీలర్లు ఈ సూచనలను తప్పక పాటించాలని లేనియెడల తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దత్తిరాజేరు మెంటాడ గజపతినగరం బోండపల్లి మండలాలకు చెందిన అధికారులు ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయాలు

స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రతీఒక్కరూ ఓటు విలువను తెలుసుకొని, రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఓటు వేయడానికి వీలుగా విభిన్న ప్రతిభావంతులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మొసానిక్ లాడ్జ్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ శనివారం నిర్వహించారు. మొసానిక్ టెంపుల్ వద్ద ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఓటు ప్రాధాన్యతను ప్రతీఒక్కరూ గుర్తించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును వినియోగించేందుకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. సదరం సర్టిఫికేట్ ప్రకారం 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారు, తాము ఇంటినుంచే ఓటు వేసుకొనే సదుపాయం ఉందన్నారు. అలాగే అవసరమైన వారికి రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని, పోలింగ్ కేంద్రాలవద్ద వలంటీర్లను, వీల్ చైర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సౌకర్యాలను వినియోగించుకొనేందుకు సక్ష్యం యాప్ ద్వారా ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అంధులకోసం బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పత్రాన్ని కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక సైన్ లాంగ్వేజీల్లో బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎడి జగదీష్, పెద్ద సంఖ్యలో విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

ఎస్సై జనార్దన్ రావు

విశాలాంధ్ర-వంగర: ప్రతి ఒక్క వాహన చోధకుడు జాగ్రత్తలు పాటించాలని. ద్విచక్ర వాహనాలు ఆటోలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ వాహ నానికి సంబంధించినటు వంటి అన్ని పత్రాలు కలిగి ఉండాలని వంగర ఎస్సై జనార్ధన రావు అన్నారు. శనివారంనాడు మగ్గురు జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలునడిపే వారికి అవగాహన కల్పించారు.ఆయన వాహనదారులతో మాట్లాడుతూ , ద్విచక్ర వాహనాలు ఆటోలు నడిపేవారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే వాహనానికి సంబంధించినటు వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని లేనటువంటి వాహనాలపై. వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి వాహనాలపై ప్రయాణాలు సాగించవద్దని, ఆ దిశగా ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన అన్నారు కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ది సైన్ స్కూల్ లో హోలీ సంబరాలు

విశాలాంధ్ర-రాజాం: రాజాం శ్రీకాకుళం రోడ్ లో ఉన్న ది సన్ స్కూల్‌లో ఈ రోజు హోళీ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు రంగురంగుల దుస్తులతో అలరించారు. ఒకరికి ఒకరు రంగులు అద్దుకుంటూ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. ప్రిన్సిపాల్ వై. భారతి హెూళి యొక్క ప్రాముఖ్యత, విశిష్టత గూర్చి విద్యార్థులకు తెలియ చేస్తూ, అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. విద్యార్థులు వివిధ రకాల ఆటలు, పాటలతో పండుగ జరుపుకున్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి లను

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర-బొబ్బిలి : స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ల 93వ వర్ధంతిని శనివారం పట్టణంలో కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ. ముందుగా భగత్ సింగ్ రాజ్‌గురు సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఒమ్మి రమణ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను భావితరాలకు తెలియకుండా. మతోన్మాదశక్తుల ఆలోచన విధానాలను నేటి యువతరం పై రుద్దడానికి నూతన విద్యా విధానాలను తెరపైకి తీసుకువస్తున్నారని, దేశానికి వెన్నెముక లాంటి రైతులను సైతం ఆందోళన బాటపట్టే విధంగా చేసిన ఘన చరిత్ర బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్యపరిచి నిరంకుశ వైఖరితో నడుస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.నాగభూషణం, అఖిల భారత యువజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, సిపిఐ పట్టణ నాయకులు పాలూరి కృష్ణ, ఏఐవైఎఫ్. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు బి తులసిరామ్, పి చిన్నారావు. బి రవికుమార్, ఎస్ భాను తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రహదారులని విస్తరిస్తాం అని హామీ ఇవ్వగలరా?

లోక్‌సత్తా సూటి ప్రశ్న...

విశాలాంధ్ర-బొబ్బిలి: రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న నాయకులు ఎవరైనా తాము గెలిచిన వెంటనే బొబ్బిలిలో ఉన్న రెండు ప్రధాన రహదారులను పూర్తిస్థాయిలో విస్తరిస్తాం అని హామీ ఇవ్వగలరా అని లోక్‌సత్తా పార్టీ తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు ప్రశ్నించారు. ప్రజా సంకల్ప వేదిక-సమాచార హక్కు చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి సురేష్ తో కలిసి బొబ్బిలి బజారు రహదారి, అలాగే పూల్‌బాగ్ రహదారులను పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ 1956 సంవత్సరంలో బొబ్బిలి మునిసిపాలిటీగా ఆవర్భవించింది, అప్పుడు ఏ రహదారులు అయితే ఉన్నాయో ఇప్పుడూ అవే ఉన్నాయి. నాయకులు ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ప్రధాన రహదారులను విస్తరిస్తాం అని హామీలు ఇవ్వడమే తప్పా ఆ హామీని అమలు చెయ్యడంపై శ్రద్ధ చూపించడం లేదని ఆరోపించారు. బొబ్బిలి-బలిజిపేట రహదారి విస్తరణ 45 శాతం పూర్తి చెయ్యడానికి తెలుగుదేశం ప్రభుత్వానికి పది సంవత్సరాలు పడితే మిగతా 55 శాతం పూర్తి చెయ్యడానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. ఇంకా రెండు రహదారులను విస్తరించాలి. అవి బజారు రహదారి మేదర బంద జంక్షన్ నుండి బజారు మీదుగా పాత బస్టాండ్ వయా రైల్వే జంక్షన్ వరకు రెండవది పూల్ బాగ్ రహదారి (దాడితల్లి గుడి నుండి బైపాస్ రహదారి వయా రాజా కాలేజ్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు). విద్వాన్ కళాశాల దగ్గర రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. యంత్రాంగానికి ఇంత నిర్లక్ష్యం పనికిరాదని, ప్రజలకి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. గ్రేడ్‌వన్ మునిసిపాలిటి, రెవెన్యూ డివిజన్, అత్యంత జనాభా ఉన్న బొబ్బిలిలో విశాలమైన రహదారులు లేకపోవడం సిగ్గుచేటని, ఇరుకైన రహదారులతో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య గురించి పట్టించుకున్న నాయకులు ఎవరు ...? అందుకే రానున్న ఎన్నికలలో పోటీచేస్తున్న నాయకులను అడుగుతున్నాం మీరు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొదటగా బొబ్బిలిలో ఉన్న రెండు ప్రధాన రహదారులను విస్తరిస్తాం అని హామీ ఇచ్చి ఓట్లు అడగగలరా అని ప్రశ్నించారు.

ఆలోచించి ఓటువేయండి...

వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

విశాలాంధ్ర-వంగర: గ్రామాల్లో ఓటర్లు ఒక్కసారి ఆలో చించి ఓటు వేయాలని విజయ నగరం పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ కోరారు. శనివారం మండలంలో కొండచాకరా పల్లి, రాజులగుమ్మడ, వీవీ అర్వేట తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్య క్రమంలో పాల్గొంటూ పార్టీలకతీతంగా, కులమతాల బేధాలు చూడకుండా తమకు ఓట్లు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. గత ఐదేళ్లలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదా రులు అందరికీ అందేలా చేశామన్నారు. మీ సమస్యలు, మా సమస్యగా భావించి వాటిని తీర్చే బాధ్యతమాదని తెలియజేస్తున్నామన్నారు. వి.వి.ఆర్ పేట గ్రామంలో "ప్రజాదీవెన" కార్యక్రమం నిర్వహిస్తూ ఓటర్ల ను కలిశారు. ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి మమ్మలను గెలిపించాలని కోరారు. పెదరాజులగుమ్మడజి లో కొన్ని కుటుంబాల వారు వైసీపీలో చేరినట్లు వైసీపీ నాయకులు తెలి పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారంకి వెళ్ళిన ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు, రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కువీవీ అర్ పేటలో కోలాటం, తప్పెడగుల్లు, తీన్‌మార్, పూలదండలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, మండల పార్టీ అధ్యక్షులు కరణం సుదర్శన్‌రావు, వైస్ ఎంపీపీ కిమిడిఉమామహేశ్వర రావు, జెసియస్ మండల కన్వీనర్ మరిచర్ల విజయలక్ష్మి, సర్పంచ్ లు, ఎంపిటిసి లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియాలో కన్వీనర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల వర్క్ షాపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల..

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడ ఎ.కన్వెన్సన్ హాల్లో శనివారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహం - అభ్యర్థుల వర్క్‌షాప్ లో శృంగవరపుకోట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి ఫోన్లో మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా ఈ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కష్టపడి పనిచేయాలని చంద్రబాబు సూచించారన్నారు.

వైసీపీకి మరోసారి ఆశీర్వదించాలి : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నిజమైన, నీతివంతమైన పాలన అందించిన వైసీపీకి మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా దాసన్నపేట నవాబు పేట ప్రాంతం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతానికి చేరుకున్న ఆయనకు ప్రజలు అఖండ స్వాగతం పలికారు. పూలమాలలు వేసి అభినందించారు. మహిళలు హారతులు పట్టి విజయ తిలకాలను దిద్దారు. డివిజన్ ప్రజలు అధిక శాతం కోలగట్లకే ఓట్లు వేస్తామని ప్రతిజ్ఞ బూనారు. దీంతో అక్కడ సందడి వాతావరణం ఏర్పడింది. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వము అందించిన సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని కోలగట్ల సవివరంగా వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రాంతంలో పర్యటిస్తున్న తరుణంలో ఐదేళ్లపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పరంగా తాము చేపట్టిన చర్యలు గూర్చి వివరిస్తుంటే ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తమకు వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేసిన వైనం గుర్తుచేసుకొని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజల కనీస అవసరాలను తీర్చడం ఒక బాధ్యతగా తీసుకున్నామన్నారు. అందువల్లనే నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మాట తప్పని మడతిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల రూపంలో ఇచ్చిన వాగ్దానాలని అమలు చేసారని కొనియాడారు. ఆయన అందిస్తున్న సంక్షేమంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటూ మౌలిక సదుపాయాలు వినియోగించుకుంటూ ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరొకసారి అవకాశం ఇచ్చినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, వైసిపి నాయకులు కేపీపీ రాజు, కోరాడ రాజు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రిన్సిపాల్: జగన్ మోహన్ రావు

విశాలాంధ్ర-మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జగన్ మోహన్ రావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ,సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యాబోధన అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వప్రైవేటు పాఠశాలలో 10 వ తరగతి పూర్తి అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ నెల 28 నుండి మే 22 వరకు ఓసీ,బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200లు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.150లు దరఖాస్తుకు రుసుం చెల్లించాలన్నారు. అనంతరం విద్యార్థికి కేటాయించే జనరల్ నంబరు ఆధారంగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మార్కుల మెరిట్,రిజర్వేషన్ రూల్స్ ప్రకారం,ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

బోటు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్నీ పరామర్శించిన లోకం మాధవి



విశాలాంధ్ర-పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి మత్స్యకార గ్రామంలో ఈ మధ్య కాలంలో బోటు బోల్తా పడి మృతి చెందిన బర్రి బ్రహ్మాజీ కుటుంబాన్ని నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి శనివారం నాడు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆవిడ మాట్లాడుతూ జనసేన నుండి రావలసిన ఇన్సూరెన్స్ ని త్వరగా వచ్చే విధంగా చొరవ తీసుకుంటానని కుటుంబానికి అన్ని విధాల అండగా నిలుస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు జనపార అప్పుడు దొర, జనసేన నాయకులు బుర్ల శంకర మండల జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఆహ్వానం

పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్ రావు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు.6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 3నుండి 31వ తేదీ వరకు, అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశానికి, ఈనెల 28 నుండి మే 22 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని,6వ తరగతికి ఏప్రిల్ 21న బక్కు నాయుడుపేట ఆదర్శ పాఠశాలల్లోనే 5వ తరగతి స్థాయి సిలబస్ తో తెలుగు, ఇంగ్లీషు మీడియములో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, అలాగే ఇంటర్మీడియట్ ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సీఈసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో మాత్రమే బోధిస్తారని, చదువుకోవడానికి ఎలాంటి ఫీజులు కట్టనవసరం లేదని పేర్కొన్నారు.6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఓసీ,బీసీ విద్యార్థులు రూ.150లు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 లను, అలాగే ఇంటర్మీడియట్ దరఖాస్తు చేసుకునేవారు ఓసి బిసి ఈడబ్ల్యూఎస్ కులానికి చెందినవారు రూ.200లు, ఎస్సీ ఎస్టీకి చెందినవారు రూ.150లు నెట్ బ్యాంకింగ్. క్రెడిట్. డెబిట్, కార్డులను ఉపయోగించి పేమెంట్, గేట్వే ద్వారా పరీక్ష రుసుము చెల్లించాలని తెలిపారు.తద్వారా కేటాయించిన జనరల్ నెంబరు ఆధారంగా ఏదైనా ఇంటర్నెట్ కేంద్రంలో www.cse.ap.gov.in లేదా https://apms.apcfss.in దరఖాస్తు చేసుకోవాలని. ఆబ్జెక్టివ్ టైపులో ఉన్న 6వ తరగతి ప్రవేశ పరీక్షలోఓసీ, బీసీ అభ్యర్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 30 మార్కులు సాధించాలని. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయించబడతాయని తెలిపారు. లిప్రవేశానికి అర్హతలు : - 6వ తరగతికి వయస్సు: ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2012 నుండి 31-08-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుండి 31-08-2014 మధ్య జన్మించినవారై ఉండాలి. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో నిరవధికంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలు చదివి, 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి. అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశానికి 10వ తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేయడానికి ముందుగా వివరాలతో కూడిన సమాచార పత్రము కొరకు www.cse.ap.gov.in లేదా https://apms.apcfss.in చూడలని ఆయన తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీడీఓ నిశ్చల, తహసీల్దార్ సత్యం



విశాలాంధ్ర-వేపాడ: ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని ఎంపీడీఓ నిశ్చల,తహశీల్దార్ సత్యం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌పై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా గ్రామాల్లో లేదా పట్టణాల్లో సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించేందుకు వీలులేదని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలపై అధికారులు గట్టి నిఘా ఉంచాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు అధికారులకు సెలవులు ఉండవని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్.ఐ రామ లక్ష్మి,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

తేది. 13-03-2024 దాసన్నపేట రింగ్‌రోడ్ నుండి కోటకి వెళ్తుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు పోయినవి. నెం.4075/2020 డాక్యుమెంట్ పేరు - **మొగిది అప్పారావు** తండ్రి నారాయణప్పుడు, దాసన్నపేట కాపు స్ట్రీట్, డోర్ నెం. 27-1-26. కావున దొరికి నవారు క్రింది అడ్రస్‌కు అందజేయవలసినదిగా మనవి.

అడ్రస్: **మొగిది అప్పారావు,**
తండ్రి నారాయణప్పుడు, డోర్ నెం. 27-1-26,
కాపుస్ట్రీట్, దాసన్నపేట, విజయనగరం-535 002

విశాలాంధ్ర ▸ విజయనగరం
పేజి : 2
ఆదివారం 24, మార్చి 2024

తిమిడి పోలమ్మ ఆలయం వద్ద బోరుబావికి ఎంపీపీ, వైస్ ఎంపీపీ శంఖుస్థాపన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండలంలోని తిమిడి గ్రామంలో గల పోలమ్మ ఆలయం వద్ద బోరుబావి పనులకు ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి శనివారం శంఖుస్థాపన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ త్రినాధమ్మ, ఉప సర్పంచ్ బి.స్వామి నాయుడు, వబ్బిన సతీష్, జనసేన నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, కారు కొండ వెంకట రావు, లైన్మేన్ భక్తుడు నత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో రాజస్తాన్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు

వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం పట్టణం రైల్వే స్టేషను రోడ్డులో శనివారం ఉదయం 7 గంటల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజస్తాన్ కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ. 90 వేలు విలువైన గంజాయిని వన్ టౌన్ ఎస్ఐ నవీన్ పడాల్ మరియు టాక్ ఫోర్స్ ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బృందం స్వాధీనం చేసుకున్నట్లుగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవన్‌టౌన్, టాస్క్ ఫోర్స్ పోలీసులకు రావడిన ఖచ్చితమైన సమాచారంపై ఎస్ఐ లు నవీన్ పడాల్, సాగర్ బాబు మరియు పోలీసు బృందం మార్చి 23న ఉదయం రైల్వే స్టేషన్ రోడ్డులో స్వీట్ ఇండియాకు సమీపంలో ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో వస్తుండగా, వారిని తనిఖీ చెయ్యగా, వారి బ్యాగుల్లో గంజాయిని గుర్తించారు. విచారణ చెయ్యగా వారిది రాజస్తాన్ రాష్ట్రం, జితేంద్ర సింగ్, బింజారాం అని, తాము కూలి పనులు చేస్తుంటామని, గంజాయి అలవాటు ఉండడంతో తక్కువ మొత్తంలో తమ అవసరాలు తీర్చుకుంటూ, మరికొంత అమ్ముకోవాలని ఉద్దేశ్యంతో సాలూరు వచ్చి, సాలూరులో 18కిలోల గంజాయిని కిలో ఒక్కింటిని రూ.2 వేలు కు కొనుగోలు చేసి, బస్సులో విజయనగరం వచ్చి, ట్రైన్ ఎక్కేందుకు గాను వెళ్తుండగా పోలీసులకు దొరికినట్లు గా తెలిపారన్నారు. నిందితుల వద్ద నుండి గంజాయిని మధ్యవర్తులు, డిప్యూటీ తాసిల్దార్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ మార్కెట్ లో రూ. 90 వేలు ఉంటుందని, నిందితులను రిమాండ్ కు తరలించామని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు తెలిపారు.గంజాయి అక్రమ రవాణా చాలా తీవ్రమైన నేరమని, ఈ తరహా కేసుల్లో అరెస్టు అయితే రిమాండులోనే 180 రోజులు బెయిల్ కూడా లభించదన్నారు. శిక్షలు కూడా తీవ్రంగా ఉంటాయన్నారు. డబ్బులకు ఆశ పడి చాలామంది యువకులు ఈ తరహా నేరాలకు పాల్పడి, గంజాయి కేసుల్లో నిందితులుగా మారుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అర్ధ రాత్రులు తిరుగుతూ ఇంటికి వస్తే వారు చెడు మార్గం పట్టే అవకాశం ఉందన్నారు. కావున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సేవించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

అసెంబ్లీ అభ్యర్థిగా సత్యనారాయణను, ఎంపీగా తనను గెలిపించాలి

నాయకులకు, కార్యకర్తలకు ఎంపీ బెల్లాన దిశానిర్దేశం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో మండల పార్టీ నాయకులు మీసాల వరహాల నాయుడు తన నివాసంలో ముఖ్య నాయకులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి మండల పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, ఇప్పిలి గోవిందరావు, ఇప్పిలి తిరుమల, మీసాల బాలు, గవిడి సురేష్, తదితరులు పాల్గొ న్నారు. సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా బస్సు సత్యనారాయణను పార్లమెంటు సభ్యునిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో వరహాల నాయుడు యువసేన కందుల కృష్ణ సతివాడ ఆదికృష్ణ గౌడ్ సురేషు మీసాల బాలు బోర్‌సింగ్ సత్యం ఎల్లంటి శివ దేవుడి గణేష్ తదితరులు పాల్గొన్నారు

18వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

విశాలాంధ్ర-మెంటాడ: మెంటాడ గ్రామంలో వేంచేసి ఉన్న విశ్వక్సేన, శ్రీ మహాలక్ష్మి, శ్రీ భూవరాహ స్వామి, శ్రీ లక్ష్మీదేవి, శ్రీ గరుడాళ్వార్లు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, ఆరాధన, సేవాకాలం, నిత్య హెూమాలు, నివేదన, మంగళస్నానం, తీర్థ ప్రసాదముల వినియోగం, సాయంత్రం 5 గంటల నుంచి గోవిందనామములు, లక్ష్మి అష్టోత్తరం, విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య హెూమం, నివేదన తీర్థ ప్రసాదముల వినియోగం పూజా కార్యక్రమంలో నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మార్చి 26న సాయంత్రం ఉదయం 8 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాసం, ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి వార్షిక కళ్యాణం, మార్చి 27న ఉదయం 7 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధన, విశేష హెూమాలు, మార్చి 28న ఉదయం 8 గంటలకు చూర్ణోత్సవం, ఉదయం 9 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ పుష్పయాగం, ధ్వజావరోహణం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మార్చి 26వ తేదీన కళ్యాణంలో పాల్గొన్న భక్తులు రూ 200, మార్చి 28న కలశాభిషేకం పూజలో పాల్గొన్న భక్తులు రూ. 30 రూపాయలు చెల్లించి భక్తులు స్వామి వారి కృపకు పాత్రులై స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం కోరారు.

తూర్పు కాపుల బలాన్ని చూపిస్తాం

కమ్మలు రెడ్డిలే పాలించాలా ?

బాబు దమ్ముంటే పులివెందులలో పోటీ చెయ్యి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : తూర్పు కాపులమంతా మేల్కొన్నామని, సంఘటితమయ్యామని, తూర్పు కాపుల బలాన్ని చూపిస్తామని, తూర్పుకాపులకు అన్యాయం చెయ్యాలని చూసే పార్టీలకు తగిన బుద్ధి చెబుతామంటూ తూర్పు కాపు సామాజిక వేదిక సంఘ నాయకులు కూటమి పార్టీలకు హెచ్చరించారు. తూర్పు కాపు సామాజిక వేదిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి అంబల్ల అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావులు మాట్లాడుతూ ఈ రాష్ట్రాన్ని ఎల్లప్పుడూ రాజకీయంగా, వ్యాపార పరంగా పరంగా కమ్మ, రెడ్డి ఈ రెండు కులాల వారే పాలించాలా, మిగిలిన కులాల వారు పాలించేందుకు అర్హులు కాదాని ప్రశ్నించారు. తూర్పు కాపు సామాజిక వర్గం ఎప్పుడూ అనగదొక్కబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ ఎంపీ, దివంగత నేత కొండపల్లి పైడితల్లి నాయుడు,మాజీ మంత్రులు పతివాడ నారాయణస్వామి నాయుడు, పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత వంటి తూర్పు కాపు సామాజిక నేతలను చంద్రబాబుచే అణచివేయబడ్డారని ఈ సందర్భంగా తెలిపారు. అధికార పార్టీ తూర్పు కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యతిస్తున్నప్పటికీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీలు తూర్పు కాపులకు సీట్లు కేటాయించేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. ఉత్తరాంధ్రలో చెప్పుకోదగ్గ తూర్పు సామాజిక వర్గ నేతలలో ప్రధాన నాయకుడైన కిమిడి కళా వెంకట్రావుకు ఇప్పటివరకు టిడిపి సీటు కేటాయించకుండా ఎందుకు సందిగ్ధంలో ఉందని ప్రశ్నించారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబుకు దమ్ముంటే జగన్మోహన్ రెడ్డి పై పులివెందులలో పోటీ చేసి గెలవాలని ఈ సందర్భంగా వారు సవాల్ చేశారు. చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన వారి సీట్లను భద్రంగా ఉంచుకుంటారని, తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన సీట్ల విషయంలో మాత్రం ఇతర కులాల వారిని, ఇతర ప్రాంతాల వారిని తీసుకువచ్చి నిలబెట్టి తూర్పు కాపు సామాజిక వర్గాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తూర్పు కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న నియోజకవర్గాలలో తూర్పు కాపులకు కాకుండా వేరే సామాజిక వర్గం వారికి సీట్లు కేటాయిస్తే కూటమి అభ్యర్థులను ఓడించి తీరుతామని హెచ్చరించారు. తమ సామాజిక వర్గానికి ఏ పార్టీ వారైతే ప్రాధాన్యతనిస్తారో ఆ పార్టీ వారికే మేమంతా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఏకపక్షంగా తాము ఏ పార్టీకి కొమ్ము కాయమని, తూర్పు కాపులను ఏ పార్టీ గుర్తిస్తుందో ఆ పార్టీ పక్షాన నిలబడతామే తప్ప మాకు ఏ పార్టీలతో సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.తూర్పు కాపులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో మా సామాజిక వర్గాన్ని కాదని ఇతర సామాజిక వర్గాల వారిని నిలబెట్టాలని చూస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా కోశాధికారి తట్టికాల వెంకటరమణ, న్యాయ సలహాదారు చందక చిన్ని ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ మందిర ప్రతిష్ట మహోత్సవాలు

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని బంగారమ్మ పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ మందిర ప్రతిష్ట మహోత్సవాలను ఈనెల 28, 29 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 30న ఉదయం 7:58 గంటలకు విగ్రహ ప్రతిష్ట చేసి మధ్యాహ్నం భారీ అన్న సమారాధన సాయంత్రం 6 గంటలకు సీతారాముల వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ బుగత సత్యనారాయణ ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

24న శ్రీ క్షేత్రంలో మహాలక్ష్మి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీ ఆదివారం నాడు మహాలక్ష్మి జయంతి ఉత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు పేర్కొన్నారు .శనివారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ 24వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఆదిలక్ష్మి దేవికి పంచామృత అభిషేకాలు తిరుమంజనం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు .ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఐశ్వర్య లక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నామని అన్నారు .భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పూజల్లో పాల్గొనవలసిందిగా కోరారు.

ఎన్నికల ప్రచారంలో మెంటాడ టిడిపి నాయకులు





విశాలాంధ్ర-మెంటాడ: రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో సాలూరు నియోజకవర్గం తరఫున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గుమ్మడి సంధ్యారాణి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ఆధ్వర్యంలో పలు టిడిపి నాయకులు కార్యకర్తలతో గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ప్రచారం భాగంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఒక్కరికి వివరిస్తూ ఇంటింటికి తిరుగుతూ టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి నీ గెలిపించి మండలంలో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చని చలుమూరి వెంకట్రావు తెలియజేశారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వైయస్సార్ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని అన్ని ధరలు అందనంత ఎత్తులో పెంచేసారని రోడ్లు గాని కాలువలు గాని పంచాయతీ సంబంధించిన వీధి కొళాయిలు గాని ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేని విధంగా జగన్ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థని నిర్వీర్యం చేసిందని ఎద్దేవ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని లేదంటే భావితరాలకు ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆంధ్రప్రదేశ్ నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం గొర్లెముసలి నాయుడు రెడ్డి ఎర్నానాయుడు పెద్దిరెడ్డి రమేష్ నాయుడు పార్టీ నాయకులు సిరిపురం గురు నాయుడు తాడ్డి తిరుపతి గొర్లె సన్యాసిరావు రెడ్డి రాజగోపాల్ పల్లి సింహాద్రి పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూ పంపిణీ అక్రమాలకు నిలయం!

- స్థానికంగా లేనివారికి, భార్యభర్తలకు, ప్రభుత్వ ఉద్యోగస్తుల కుటుంబాలకు భూ పంపిణీ జరిగాయంటూ ఆరోపణలు...

- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు - ఇష్టారాజ్యంగా క్రయ విక్రయాలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలంలో ప్రభుత్వ భూములు, కొండవాగులు చెరువులను కొన్ని సంవత్సరాలనుండి మోతుభరులు, పెద్దలు ఆయా గ్రామాల్లో ఆక్రమించుకొని కొంతమంది సాగుచేయగా, మరి కొంతమంది లక్షలాది రూపాయిలకు క్రయ, విక్రయాలు జరుపుకుంటున్నప్పటికీ సంబంధిత రెవిన్యూ, సర్కారు పెద్దలు పట్టించుకోకపోవటంతో పాటు తొమ్మిదవ విడత భూ పంపిణీ పట్టాలు మంజూరు చేయడం జరిగింది. తొమ్మిదవ విడత భూ పంపిణీ విషయంలో పలువురి నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలుకు తావులేదని, ఎంతటి వారైనా ఉపేక్షించిదే లేదని ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తున్నప్పటికీ, తిరిగి వారే అక్రమాలకు పాల్పడటం పలు విమర్శలకు తావిస్తుంది. జిల్లాలో అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రాస్ ఏది అని అంటే అందరి నోటా వినిపించేది మెరకముడిదాం మండలం అని చెప్పవచ్చు. అందులో భాగంగా గరుగుబిల్లి పంచాయతీ కొండలావేరు పంచాయతీ లో కాకుండా ఇతర పంచాయతీలో భార్యాభర్తలకు, ఉద్యోగస్తులకు పట్టాల మంజూరు చేయడం జరిగింది. ఈ భూ పంపిణీ సుమారుగా అన్ని గ్రామాల్లో పంపిణీ జరిగింది. ప్రభుత్వం వారు బడుగు బలహీన వర్గాల వారికి భూ పంపిణీ చేయమని సూచించడంతో ఇదే ఆసరాగా తీసుకుని స్థానికంగా ఉన్న వారికి కాక ఇతర మండలాల్లో ఇతర జిల్లాల్లో ఉన్నవారికి భూ పంపిణీ జరిగింది. ప్రభుత్వం వారు నిరుపేద కుటుంబాలకు, కాకుండా భూమి మోతుభరులు, ఉద్యోగస్తులకు పెద్దలు ఆక్రమణ చేరలోకి వెళ్ళిపోయింది. సదరు ప్రభుత్వ భూములు పలుకుబడి వున్న బయట మండలాల్లో ఉన్నవారు ఆక్రమించుకొని లక్షలాది రూపాయిలకు విక్రయాలు జరుపుకున్నా పట్టించుకునే నాథుడు లేరు. ఇలా ప్రభుత్వ ఆస్తులు మండలంలో అనేకం ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. భూ పంపిణీ మాత్రం లక్షల్లో రాబడి రావడం వల్ల అధికారుల భూ పంపిణీ మీదే దృష్టి పెట్టారు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సర్కారు పెద్దలు స్పందించి ప్రభుత్వ భూములు ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని మండల ప్రజానీకం కోరుతున్నారు. దీనిపై తాసిల్దారు వివరణ ఇస్తూ... ఈ పట్టాల విషయంపై గతంలో తహసిల్దార్ ఏవిధంగా ఇచ్చారో నాకు అవగాహన లేదు. సదరు ఫైలు తెప్పించి స్టడీ చేసి తీసుకోవడం జరుగుతుంది అని తహసిల్దార్ పద్మావతి వివరణ ఇచ్చారు.

ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తే చర్యలు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి



విశాలాంధ్ర-మెంటాడ: ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారులు పక్కాగా అమలుచేయాలని సాలూ రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణు చరణ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మెంటాడ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, నిబంధన లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై వేటు తప్ప దని హెచ్చరించారు. వాలంటీర్లు ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, వాలంటీర్లపై నిఘా ఉందని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ యస్.దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈవోపీఆర్డి విమల కుమారి, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ దందా నుండి గిరిజన రైతులకు న్యాయం చేయాలి

గిరిజన రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి రెవిన్యూలో గల గిరిజనుల భూములు రియల్ ఏస్టేట్ దందాతో అన్యాక్రాంతం అవుతున్నాయని రియల్ ఎస్టేట్ దందా నుండి గిరిజనుల భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గిరిజన రైతులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ పట్టా ఒకరి చేతిలో భూమి ఇంకొకరి చేతిలో ఉందని, గిరిజనులను మోసగించి, బెదిరించి భూములు లాక్కుంటున్న రియల్ వ్యాపారులపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 2003 సంవత్సరానికి ముందు ఉన్న పట్టాలకు రెగ్యులర్ చేయడానికి రియల్ వ్యాపారులు రెవిన్యూతో లక్షల్లో ఒప్పందాలు కుదుర్చుకొని అసలు రైతులకు రెగ్యులర్ చేయకుండా రియల్ ఎస్టేట్ దారులకు ఆభూములను అప్పగించే యోజనలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారన్నారు.ఇప్పటికే డి-పట్టా భూములు అమ్మినట్టు గుర్తిస్తే పిఓటిలో పెట్టవలసిన రెవిన్యూ అధికారులు రియల్ వ్యాపారులతో చేతులు కలిపి అమ్మిన భూములను రెగ్యులర్ చేస్తూ రైతుల దగ్గర ఉన్న భూములను పిఓటిలో పెట్టడం దారుణం అన్నారు. కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజనులకు ఇచ్చిన డి- పట్టా భూముల్లో కంపెనీల కబ్జాకు సిద్ధమవుతున్నాయని గిరిజన రైతులతో శనివారం ఆందోళన చేపట్టారు. కొండగంగుపూడిలో ఉన్న ఐటీడీఏ హైస్కూల్ నుంచి కోటయ్య గురువు వరకు ఉన్న తారు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములు సుమారు ఎకరా 50 లక్షల వరకు విలువ ఉంటుంది, కానీ అమాయక గిరిజనులను మాయ చేసి మోసగించి రెండు లక్షల నుంచి మూడు లక్షలకు మాట్లాడి ఖాళీ తెల్ల కాగితాలపై రాయించుకుని రియల్ బ్రోకర్లు బోత్ర అనే కంపెనీకి సుమారు 200 ఎకరాలు సమీకరించిందని,ఈ సమీకరణకు బొద్దాం కేంద్రంగా ఒక ఆఫీసు నిర్వహణ కూడా జరుగుతుందని, సమీకరించిన భూమిని బోత్ర వేరే యజమానులకు అధిక మొత్తానికి పేపర్లపై అమ్మేసుకుందని ఈ భూములు కొనుగోలు చేసిన వేరే కంపెనీ గిరిజనులకు కొంత,బ్రోకర్లకు కొంత,రెవిన్యూ సిబ్బందికి కొంత మూడు విభాగాలుగా నిర్ణయించుకొని వీఆర్వో నుంచి సీసీఎల్ఏ వరకు మొత్తం వ్యవహారం నడుపుతున్నారు. వారు కొనుగోలు చేసిన పక్కనున్న భూములు గిరిజనులు ఇవ్వకపోతే బెదిరిస్తున్నారన్నారు. అలాగే రియల్ వ్యాపారాలు కొనుగోలు చేసిన భూములను మాత్రమే భూ బదలాయింపు చట్టంలో ప్రకారం రెవెన్యూ అధికారులు రెగ్యులరైజ్ చేస్తున్నారు. గిరిజనల సాగులో గల భూములను రెగ్యులర్ చేయకుండా పిఓటి కింద ఉంచేసి భూ బదలాయింపు చట్టంలో ఉన్నదని ఆ చట్ట సవరణ నాటికి అమ్మకం జరిగిన భూములకు పిఓటిలో పెట్టి సాగు చేస్తున్న రైతులకు రెగ్యులరైజ్ చేయాలి కానీ వేపాడ రెవిన్యూ సిబ్బంది దీనికి భిన్నంగా నడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు రెగ్యులర్ చేసి కంపెనీలు కొనుగోలు చేసిన భూములను పిఓటిలో పెట్టి ఆ భూములు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. అలాగే 1985 లో కేజీపూడి రైతులకు పట్టాలు ఇచ్చిన ఇప్పటికీ భూమి అప్పగించలేదని పట్టా ఒక్క దగ్గర సాగు ఒక దగ్గర చేస్తూ గిరిజన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు జిల్లా అధికారులు స్పందించి పట్టా ఉన్న అసలైన రైతులకు భూమి అప్పగించాలని కోరారు. అలాగే రెవిన్యూ సిబ్బంది అవినీతి నిర్లక్ష్యం కారణంగా భూముతో సంబంధం లేని రైతులకు ఆన్లైన్లో చేసి ఉన్నారు. ఇలా ఎవరి పేరునో ఆన్లైన్లో భూములు ఉన్నందువలన అసలైన రైతులు భూములు కోల్పోవలసి వస్తుందన్నారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి అసలైన రైతులకు ఆన్లైన్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజన రైతులకు సర్వే నిర్వహించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతు సంఘం జిల్లా నాయకులు సుకురు గంగులు, చేపల నాగరాజులతో పాటు కేజీపూడి యువకులు మహిళా రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లవద్ద ఓటరు సహాయ కేంద్రాలు

చిన్నపిల్లల కోసం క్రష్ ఏర్పాటు

ప్రహరీగోడ లేనిచోట్ల బారికేడ్ల నిర్మాణం

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

ఎస్.కోటలో జిల్లా ఎన్నికల అధికారి పర్యటన

విశాలాంధ్ర-ఎస్.కోటః పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. చిన్నపిల్లల కోసం క్రష్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆమె శృంగవరపుకోట మండలంలో శనివారం పర్యటించారు. నియోజకవర్గం పరిధిలోని తాశిల్దార్లు, ఎంపిడిఓలు, సెక్టార్ అధికారులు, డిటిలు, పోలీసు అధికారులతో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్లకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు పోలింగ్ కేంద్రాల వెలుపల 100 మీటర్ల దూరంలో ఒక ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇక్కడ బిఎల్ఓలు ఉండి ఓటర్లకు మిగిలిపోయిన ఓటరు స్లిప్పులను అందిస్తారని, అవసరమైన సహకారాన్ని అందజేస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వెలుపల మాత్రమే రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండేలా చూడాలన్నారు. ప్రహరీగోడ లేని పాఠశాలలవద్ద బారికేడ్లతో రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటేయడానికి వచ్చే బాలింతలు, చిన్నపిల్లల సౌకర్యం కోసం అంగన్‌వాడీ సిబ్బందితో క్రష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్దా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కనీస మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే వేసవిని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, వేచిఉండే చోట నీడ కోసం టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య శిబిరాల్లో ఓఆర్ఎస్ ఉండేలా చూడాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక మోడల్ యూత్ పోలింగ్ కేంద్రం, ఒక మోడల్ మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ముందే ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎన్నికల నాటికి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. వృద్ధులకు, దివ్యాంగులకు సహకారాన్ని అందించేందుకు, 18 ఏళ్లు కంటే తక్కువ వయసు ఉన్న వారినే 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఈ ఏడాది ఇంటినుంచే ఓటు చేసే అవకాశాన్ని కల్పించారని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని పరిస్థితిలో ఇలాంటివారికి హెూమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన బూత్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి, కళాజాతాలను, ఓటర్లకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి, ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. దీనికోసం బూత్ స్థాయిలో, నియోజకవర్గ స్థాయిల్లో విస్తృతంగా స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ కోరారు.

మోడల్ కోడ్ ఖచ్చితంగా అమలు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి, కళాశాలను కలెక్టర్ సందర్శించారు. గదులను, కళాశాల ఆవరణను పరిశీలించారు. బస్సులకోసం పార్కింగ్, స్టాల్స్ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రతీఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలని కోరారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్, వాహనాలు, ఇంటింటి ప్రచారం, పాంఫ్లెట్లు, స్టిక్కర్ల పంపిణీ తదితర వాటికి ముందుగానే సంబంధిత ఆర్ఓ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు, నగదు, మద్యం పంపిణీ తదితర వాటిని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్

ఎస్.కోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. బిఎల్ఓలతో మాట్లాడి అక్కడి వసతులను ఆరా తీశారు. ర్యాంపులు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్, ఫర్నీచర్, నేమ్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని చదునుచేసి, శుభ్రం చేయాలని సూచించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, శృంగవరపుకోట నియోజకవర్గ ఆర్ఓ పి.మురళీకృష్ణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.